# తెలుగుప్రభ

మన భాష.. మన పత్రిక

వైబ్రెంట్ ఎడిషన్ 4pm

బుధవారం 5-7-2023

teluguprabha.net  TeluguPrabha @TeluguPrabhaofficial





అంతుపట్టని నేతల తీరు

బీజేపీ చీఫ్ మార్పుతో రసకందాయంలో రాజకీయం

ఒంటరిగానే సై అంటున్న బీఆర్ఎస్

పొత్తుల కోసం వెంపర్లాడుతున్న కాంగ్రెస్

**తెలంగాణ రాజకీయాల్లో ఎన్నికల వేడి మొదలైంది. ఎన్నికలే లక్ష్యంగా ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే వ్యూహ, ప్రతి వ్యూహాలు పన్నుతున్నాయి. గెలుపే ధ్యేయంగా ముందుకు సాగుతున్నాయి. బీజేపీ అధ్యక్షుడి మార్పుతో కాషాయ పార్టీలో కొత్త సమీకరణాలు మొదలయ్యాయి. నూతన అధ్యక్షుడు కిషన్ రెడ్డి పార్టీ వ్యవహారాల్లో చురుగా వ్యవహరిస్తున్నారు. బీఆర్ఎస్ కు ప్రత్యామ్నాయంగా ఎదిగేందుకు ప్రయత్నిస్తున్నారు. అయితే అధికార పార్టీ మాత్రం తమదైన శైలిలో సంక్షేమ దిశగా దూసుకెళ్తోంది. ఎన్నికలు సమీపిస్తుండడంతో అభివృద్ధి కార్యక్రమాల్లో దూకుడు పెంచింది. ఇలా ఉండగా ఎన్నికల నేపథ్యంలో ఏ పార్టీ ఎవరితో పొత్తు పెట్టుకుంటుంది అనేది చర్చనీయాంశంగా మారింది. కిషన్ రెడ్డి మార్పు వెనుక బీజేపీ వ్యూహాత్మక ఎత్తుగడ ఉందని ప్రచారం జరుగుతోంది.**

## తెలంగాణలో రాజకీయ పార్టీల పొత్తులపై ఆసక్తి

(తెలుగుప్రభ, హైదరాబాద్)

ప్రస్తుత రాజకీయాలు.. రోజురోజుకూ మారుతున్న వాటి ధోరణులు చూస్తుంటే కేంద్రం, రాష్ట్రంలో ఏవి మిత్రపక్షాలో, ఏవి శత్రుపక్షాలో తెలియని అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని గద్దె దింపడానికే ముఖ్యమంత్రి కేసీఆర్ బీఆర్ఎస్‌ను ఏర్పాటు చేశారని, తెలంగాణలోనూ మళ్లీ అధికారంలోకి వచ్చేందుకు దూకుడు పెంచారని పరిస్థితులను బట్టి అర్థం అవుతుంది. మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో పార్టీని బలోపేతం చేసేందుకు ఇటీవల వందలాది కార్లతో వేలసంఖ్యలో మంత్రులు, ఎమ్మెల్యేలతో సహ ర్యాలీగా వెళ్లడాన్ని రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారింది. అయితే, కాంగ్రెస్ మాత్రం బీజేపీ, బీఆర్ఎస్‌ల వైరం పైకి కనబడే ఎన్నికల స్టంటే తప్ప వాస్తవం కాదని ఆ పార్టీ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ అంటున్నారు. ఇటీవల ఖమ్మంలో ప్రసంగిస్తూ రాహుల్‌గాంధీ, బీఆర్ఎస్‌కు బీజేపీ అండదండలున్నాయని..అది బీజేపీకి బీ టీమ్ అని వ్యాఖ్యానించారు. అంతేకాదు, రాష్ట్రంలో అసలు బీజేపీయే లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ సహా బీఆర్ఎస్ అగ్ర నేతలందరూ ఆ వ్యాఖ్యలను కొట్టిపారేశారు.

### దోస్తులు.. కయ్యాలు..

బీజేపీ, కాంగ్రెస్‌లు దోస్తులేనని బీఆర్ఎస్ నేతలు చెబుతారు. బీఆర్ఎస్ నేతలపై ఐటీ, ఈడీ తదితర కేసులతో భయభ్రాంతులు సష్టిస్తున్న కేంద్రం రాష్ట్రంలోని కాంగ్రెస్ నాయకులపై ఎందుకు దాడులు చేయడం లేదని మునిసిపల్ మంత్రి కేటీఆర్ తన ప్రసంగాల్లో తరచూ ప్రశ్నిస్తుంటారు. నగరంలో ఆకాశమార్గాల నిర్మాణానికి రక్షణశాఖ స్థలాలు ఇవ్వడం లేదని, ఇతరత్రా అంశాలు ప్రస్తావిస్తూ బీజేపీకి తమతో ఉన్నది కయ్యమేనని కుండబద్దలు కొడతారు. అంతేకాదు.. తమ పార్టీబీజేపీకి బీ టీమ్, కాంగ్రెస్‌కు సీ టీమ్ కాదని, ఆ రెండుపార్టీలనూ ఒంటిచేత్తో ఢీకొట్టే డీ టీమ్అని అభివర్ణించారు. బీజేపీ భుజంపై తుపాకీ పెట్టి కాంగ్రెస్ తమను కాల్చే కుట్ర చేస్తోందన్నారు.

ఇదిలా ఉండగా, కాంగ్రెస్ మాత్రం పొత్తుల కోసం వెంపర్లాడుతోంది. కమ్యూనిస్టుల సహా టీజేఎస్ వంటి పార్టీలతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. అలాగే, బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి ఉద్యమకారుల అండదండల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. బండి సంజయ్‌ను అకస్మాత్తుగా మార్చడాన్ని బీజేపీలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇది పార్టీ మేలా.., కీడు చేస్తుందా అని పార్టీ శ్రేణులు అంతర్గతంగా చర్చించుకుంటున్నాయి. నూతన అధ్యక్షుడు కిషన్ రెడ్డి మాత్రం ఎన్నికలకు ఎవరితో కలిసి వెళ్లాలనే దానిపై నేతలతో సమాలోచనలు చేస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తేనే కానీ ఎవరితో ఎవరు అనేది ఇప్పట్లో తేలేలా లేదు.

## లేటెస్ట్ న్యూస్



# అక్షరాలా లక్ష కోట్లు

**పదేళ్లలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి నిధులు**

**గతం కంటే 462 రెట్లు అధికం**

**పదేళ్ల నివేదిక విడుదల చేసిన సర్కారు**

(తెలుగుప్రభ, హైదరాబాద్) రాష్ట్ర ప్రభుత్వం 2014-23 మధ్య కాలంలో ఎంఏయూడీ శాఖ ద్వారా హైదరాబాద్, రాష్ట్రంలోని ఇతర మునిసిపల్ పట్టణాల్లో మౌళిక సదుపాయాలు, అభివృద్ధి కేటాయించిన నిధులు అక్షరాలా రూ. 1,21,294 కోట్లు. ఉమ్మడి రాష్ట్రంలో 2004-14 మధ్య కాలంఒలో వెచ్చించిన రూ. 26,211.50 కోట్ల కంటే 462.8% అధికం అని లెక్కలు చెబుతున్నాయి. కాగా, మొత్తం ఇప్పటి వరకు తెలంగాణలో వెచ్చించిన నిధుల్లో సింహభాగం అంటే రూ. 1,11,360 కోట్లు. (91.8%) రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టగా, కేవలం 9,934 కోట్లు మాత్రమే కేంద్ర ప్రభుత్వం సమకూర్చింది. తెలంగాణ ప్రభుత్వం వెచ్చించిన నిధుల్లో అధిక భాగం మహా నగర అభివృద్ధికి కేటాయించినట్లుగా తెలుస్తోంది. ఉచిత తాగునీరు, వార్డు కార్యాలయాల ఏర్పాటు, స్ట్రాటజిక్ అర్బన్ డెవలప్ మెంట్, నీటి ప్రాజెక్టులు, మెట్రో పొడిగింపు వంటి కీలక ప్రాజెక్టులకు తెలంగాణ సర్కారు ప్రాధాన్యం ఇచ్చిందని మంత్రి కేటీఆర్ వెల్లడించారు. ఈ మేరకు నివేదికను ఎంఏయూడీ ప్రత్యేక కార్యదర్శి అరవింద్ కుమార్ మేయర్ విజయలక్ష్మి తో కలిసి ఆయన విడుదల చేశారు.




# మరో బస్తీ దవాఖానా

అంబర్‌పేట డివిజన్‌లో ప్రారంభం

పేదల చెంతకే వైద్యం.. తలసాని

(తెలుగుప్రభ, అంబర్‌పేట్) పేద ప్రజలకు ప్రభుత్వ వైద్య సేవలను మరింత చేరువ చేసేందుకే బస్తీ దవాఖానాలు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు, బుధవారం అంబర్ పేట నియోజకవర్గ పరిధి అంబర్ పేట డివిజన్ పటేల్ నగర్ చౌరస్తాలో బస్తీ దవాఖానను మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ , ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ , డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి, కార్పొరేటర్ ఇ.విజయ్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జీహెచ్ఎంసి పరిధిలోని 360 బస్తీ దవాఖానల ద్వారా ప్రజలకు వైద్య సేవలు అందుతున్నాయని అన్నారు. ప్రజల ఆరోగ్య సంరక్షణకు తెలంగాణ ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత వైద్య సేవలను ప్రజలకు మరింత అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు కేసీఆర్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. పేద ప్రజలు అధికంగా నివసించే అంబర్పేటలో ఈ రోజు బస్తీ దవాఖానానీ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నల్లకుంట, అంబర్‌పేట డివిజన్‌లో బస్తీ దవాఖాన ఏర్పాటు ప్రారంభించడం సంతోషంగా ఉందని తెలిపారు.



# బాధాకరం

**బండి సంజయ్ మార్పుపై విజయశాంతి**

(తెలుగుప్రభ, హైదరాబాద్)

బండి సంజయ్ మార్పు బాధాకరమని బీజేపీ సీనియర్ నాయకురాలు విజయశాంతి అన్నారు. ఎందుకు మార్చారో సరైన కారణాలు కూడా చెప్పలేదని తెలిపారు. స్పందించారు. ఆయన మార్పు బాధాకరమని వ్యాఖ్యానించారు. ఈ మేరకు ఆమె ట్వీట్ చేశారు. బీజేపీ అధ్యక్షుడిగా బండి సంజయ్‌ను తొలగిస్తారని గత కొద్దినెలలుగా వార్తలు వినిపిస్తున్నా.. ఎన్నికల వేళ మార్పు ఉండదని కొంతమంది భావించారు. కానీ కర్ణాటక ఎన్నికల తర్వాత రాష్ట్రంలో బీజేపీ గ్రాఫ్ తగ్గిపోవడంతో పార్టీ బలోపేతంపై అధిష్టానం పూర్తి దృష్టి పెట్టింది. నేతల మధ్య విబేధాలతోనే పార్టీ బలపడటం లేదనే కారణంతో బండిని మార్చి సీనియర్ నేతగా ఉన్న కిషన్ రెడ్డికి బాధ్యతలను అప్పగించింది. ఈ క్రమంలో బండి సంజయ్ మార్పుపై పలువురు రాష్ట్ర బీజేపీ నేతలు స్పందిస్తున్నారు. అందులో భాగంగా తాజాగా సీనియర్ నాయకురాలు విజయశాంతి బీజేపీలోని మార్పులపై స్పందించారు. ఈ మేరకు ఆమె ఓ ట్వీట్ చేశారు. నిప్పులు పుట్టించే నడకను పార్టీకి రాష్ట్రంలో నేర్పిన బండి సంజయ్‌ను మార్చడం బాధాకరమని, ఆయనకు త్వరలో మరింత మంచి బాధ్యతను ఢిల్లీ అధిష్టానం అప్పగిస్తుందని ఆశిస్తున్నట్లు తెలిపారు.

# అందుకే కేబినెట్ భేటీకి దూరంగా ఉన్నా..

అసంతృప్తి లేదు : కిషన్ రెడ్డి



తెలుగుప్రభ, న్యూఢిల్లీ: అనారోగ్యం వల్లే కేబినెట్ భేటీకి దూరంగా ఉన్నానని, కేంద్రమంత్రి పదవికి తాను రాజీనామా చేయలేదని కిషన్‌రెడ్డి క్లారిటీ ఇచ్చారు. అధిష్టానం ఏ ఆదేశాలిచ్చినా పాటిస్తానని, తనకు అధ్యక్ష పదవి ఇస్తారని అనుకోలేదని అన్నారు. ఈ మేరకు బుధవారం ఢిల్లీ లో ఆయన మీడియాతో మాట్లాడారు. మంగళవారం తాను హైదరాబాద్‌లో ఉన్నప్పుడు జేపీ నడ్డా ఫోన్ చేసి విషయం చెప్పారన్నారు. గతంలో ఉమ్మడి ఏపీకి రెండు సార్లు, తొలి తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా కూడా ఒకసారి.. పనిచేశానన్నారు. నాల్గవసారి పార్టీ అధ్యక్షుడిగా తనపై అధిష్టానం బాధ్యతలు అప్పగించిందని చెప్పారు. ఎంపీగా గెలిచాక హోం శాఖ సహాయ మంత్రిగా, ఆ తర్వాత రెండేళ్లు కేబినెట్ మంత్రిగా పని చేశానని కిషన్ రెడ్డి గుర్తుచేసుకున్నారు. తాను ఏనాడూ పార్టీని ఏదీ అడగలేదని, కోరలేదని, పార్టీ ఆదేశాలను పాటిస్తూ వస్తున్నానన్నారు. 1980 నుంచి ఒక సైనికుడిలా పనిచేస్తూ వస్తున్నానన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ (BJP) అధికారంలోకి రావాలి అనే లక్ష్యంతో కృషి చేస్తానని, సమిష్టి ప్రణాళిక తయారుచేసుకుని ముందుకు వెళ్తానని స్పష్టం చేశారు. మరికాసేపట్లో హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్తున్నానని, ఈరోజు రాత్రి పార్టీ ముఖ్య నేతలను కలిసి మాట్లాడతానని చెప్పారు.



# నకిలీ నోట్ల ముఠా పట్టివేత

**కర్నూలు జిల్లాలో నకిలీ నోట్ల ముఠాను పట్టుకున్న పోలీసులు 8 మందిని అరెస్టు చేసి వారివద్దనుంచి రూ.1.03 కోట్ల నకిలీ నోట్లను సీజ్ చేశారు. మూడు బైకులు స్వాధీనం చేసుకున్నారు.**



# ఆ గ్రామాలు షెడ్యూల్ 5 పరిధిలోకే..

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు

75 ఏళ్ల తర్వాత ఫలించిన పోరాటం

తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పు వెలువరించింది. ములుగు జిల్లా మంగపేట మండలంలోని 23 గ్రామాలు రాజ్యాంగంలోని ఐదో షెడ్యూల్ పరిధిలోకి వస్తాయని హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భూయాన్ కీలక తీర్పు వెలువరించారు. ఆ గ్రామాలన్నీ షెడ్యూల్ ప్రాంతం క్రిందకే వస్తాయని స్పష్టం చేసింది. 75 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం తర్వాత ఆదివాసీలకు అనుకూలంగా హైకోర్టు ఈ కీలక తీర్పు ఇచ్చింది. దీంతో ఈ తీర్పుపై ఆదివాసీలు హర్షం వ్యక్తం చేస్తోన్నారు. ఈ కేసులో ఆదివాసీల తరపున న్యాయవాది చిక్కుడు ప్రభాకర్ వాదనలు వినిపించారు. ఈ సందర్భంగా రాజ్యాంగం పరిధిలోని ఐదవ షెడ్యూల్ పరిధిలోకి సదరు గ్రామాలు రావని ఆదివాసీయేతర నేతలు వాదనలు వినిపించారు. సుదీర్ఘ విచారణ అనంతరం ఆదివాసీలకు అనుకూలంగా హైకోర్టులో తీర్పు వచ్చింది. దీంతో 75 ఏళ్ల పోరాటం తర్వాత ఆదివాసీలకే గ్రామాలు దక్కడంతో ఆనందోత్సాహాల్లో మునిగిపోయారు. ఇన్నేళ్ల తర్వాత తీర్పు రావడంతో ఈ వార్త కీలకంగా మారింది. అయితే ఈ కేసు విషయంలో సింగిల్ జడ్జి గతంలో ఇచ్చిన తీర్పును పట్టించుకోలేమని హైకోర్టు తెలిపింది. ఆదివాసీయేతరుల అప్పీల్‌ను కొట్టివేస్తూ ఈ సందర్భంగా నిర్ణయం తీసుకుంది. కాగా షెడ్యూల్-5లో ఆదివాసీల గ్రామాలకు సంబంధించి పలు నిబంధనలను ఉన్నాయి.